సైన్సు పరీక్షకు 248 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బుధవారం పదో తరగతి ఫిజికల్ సైన్సు పరీక్షకు 248 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి తెలిపారు. బుధవారం జిల్లాస్థాయి పరిశీలకులు నాలుగు కేంద్రాలు, డిఆర్ఒ ఒక పరీక్షా కేంద్రం, డీఈవో మూడు పరీక్షా కేంద్రాలు పరిశీలించారని తెలిపారు. అలాగే ఫ్లైయింగ్ స్వాండ్ 19 పరీక్షా కేంద్రాలు, సిట్టింగ్ స్వాడ్ 65 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన్నట్లు తెలిపారు. 118 పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతారణంలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న ఎండలు.. తడారుతున్న గొంతులు

- దాహం తీరే దారి లేక ప్రజల అవస్థలు

కొన్ని ప్రదేశాల్లో గుక్కెడు నీరు అందక ప్రజలు దాహమో.. రామచంద్రా.. అంటూ అలమటించాల్సిన పరిస్థితి. మండుతున్న ఎండలతో గొంతు తడుపుకోవడానికి పరుగులు పెట్టాల్సిన దుస్థితి. ప్రజల సౌకర్యాలను పట్టించుకోవాల్సిన అధికారులు సైతం నిమ్మకునీరుతున్నట్టు వ్యవహరించడంతో ఇలాంటి పరిస్థితులు దాపరిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు.

చలివేంద్రం లేని పూతలపట్టు ఎంపీడీవో కార్యాలయం

ప్రజాశక్తి- పూతలపట్టు: వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటల నుంచి భానుడు భగభగమంటూ పొగలు కక్కుతున్నాడు. వేడి తీవ్రతతో తాగునీటి అవసరాలు పెరిగాయి. పల్లెల నుంచి వేలాదిమంది నిత్యం మండల కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం వస్తుంటారు. మండల కేంద్రంలో గుక్కెడు నీరు దొరక్క అవస్థలు పడుతున్నారు. పూతలపట్టు మండలం పరిధిలో ప్రతి సోమవారం తహశీల్దార్, ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వందలాది మంది జనం తరలివస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఎండ తీవ్రతతో దాహం తీరే పరిస్థితి లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మార్చి నెల చివరివారం వచ్చినా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఆరుబయట చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దుకాణాలలో తాగునీటి సీసాలు కొనుగోలు చేసి గొంతు తడుపుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

దాహం తీరే దారేది...?

నిత్యం ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు అధికారులు కనీస తాగునీటి వసతులు కూడా ఏర్పాటు చేయడం లేదు. మండుతున్న ఎండల్లో గొంతు ఎండబెట్టుకొని కార్యాలయాలకు వస్తే గుక్కడు నీరు దొరకడం లేదు. అదేవిధంగా సచివాలయాలు, ఆర్.బి.కె కేంద్రాల వద్ద కూడా ఇదే పరిస్థితి. గొంతు తడుపుకోవాలంటే దుకాణాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి.

చలివేంద్రాల జాడేది..?

గతంలో ఎంపీడీవో కార్యాలయం ముందు సిబ్బంది చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. కార్యాలయానికి వచ్చే ప్రజలు చలివేంద్రాల ద్వారా దాహార్తిని తీర్చుకునేవారు. అదేవిధంగా నిత్యం ప్రజలతో రద్దీగా ఉన్న అంబేద్కర్ సర్కిల్ వద్ద స్వచ్ఛంద సేవా సంస్థలు, యువత చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. బస్సుల కోసం మండుటెండలో నిలబడే ప్రయాణికులు ఈ చలివేంద్రాలను వినియోగించుకునేవారు. ప్రస్తుతం ఈ చలివేంద్రాల జాడ కనిపించడం లేదు. ఫలితంగా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. అధికారులు, స్వచ్ఛంద సేవాసంస్థలు ఈ సమస్యపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

విస్తరణ జరిగేనా..?

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

అభివృద్ధి పేరుతో చిత్తూరు నగర హైరోడ్డు విస్తరణ, పాత బస్టాండ్ మూసివేతకు అధికార పార్టీ నేతలు పూనుకున్నారు. శరవేగంగా అభివృద్ధి పనులు పూర్తి చేసి చూపుతామంటూ రోడ్డు విస్తరణ పేరిట ఆక్రమణలను తొలగించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణమంటూ కాసు బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మిస్తూ రేకుల ప్రహరీ నిర్వహించారు. కానీ పనులు మాత్రం రెండు నెలలుగా ఎక్కడిక్కడ అలానే ఉండటం గమనార్హం.

అర్ధాంతరంగా ఆగిపోయిన హై రోడ్డు విస్తరణ పనులు

గత రెండు నెలలుగా చిత్తూరు నగరంలో అభివృద్ధి పేరిట కూటమి నేతలు నానాహడావిడి చేశారు. చిత్తూరు నగరానికి మహర్ధశ వచ్చేస్తోందంటూ కట్టమంచి నుండీ రెడ్డిగుంట వరకు దాదాపు 8 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు శ్రీకారం చుట్టారు. గతంలో చిత్తూరు నగరంలోని సంతపేట రోడ్డు విస్తరణలో కీలకంగా వ్యవహరించిన నాటి టౌన్ ప్లానింగ్ అధికారి నాగేంద్రను అసిసెంట్ సిటీ ప్లానర్‌గా చిత్తూరు తీసుకొచ్చారు. చిత్తూరుకు వచ్చిన వెంటనే అసిస్టెంట్ ప్లానర్ నాగేంద్ర హైరోడ్డు విస్తరణపై దృష్టి సారించారు. హైరోడ్డు వంద అడగులు విస్తరణకు సర్వే నిర్వహించి ఏ మేరకు కట్టాడాలను కూల్చివేయాలో మార్కింగ్ చేశారు. గత రెండు, మూడు నెలలుగా చిత్తూరు హైరోడ్డు విస్తరణ ప్రధాన చర్చగా నడిచింది. ఓ దశలో అభివృద్ధి నిరోధకులా....? సహకరిస్తారా అంటూ కూటమి ప్రభుత్వం పేరిట అధికార పార్టీ హోర్డింగ్‌లు ఏర్పాటు చేసింది. పాత బస్టాండ్ విషయంలో అధికార కూటమి నాయకులు, వైసిపి నాయకులు మధ్య మాటలయుద్ధం సాగింది. ఏది ఏమైనా గత నెల రోజులుగా హైరోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. సిటిప్లానర్ నాగేంద్ర కనిపించడం లేదు. పాత బస్టాండ్ విషయంలో భూములు లీజుకు తీసుకొని చిన్నచిన్న షాపులు నిర్మించుకున్న యజమానులు కోర్టును ఆశ్రయించారు. హైరోడ్డు విస్తర్ణలో తమకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా విస్తరణ పనులు చేస్తున్నారంటూ హైరోడ్డు భవన యజమానులు కోర్టును ఆశ్రయించిన్నట్లు సమాచారం. దీంతో ఇటు హైరోడ్డు విస్తరణ, పాతబస్టాండ్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అటకెక్కిన్నట్లు తెలుస్తోంది.

అభివృద్ధి పేరుతో పాత బస్టాండ్‌లో కూరగాయాల చిరువ్యాపారులను స్థానిక రైతుబజార్‌కు మార్చారు. ఇలా పాతబస్టాండ్ నుండీ రైతు బజార్‌కు మారిన కూరగాయాల వ్యాపారులు వ్యాపారం జరగడం లేదంటూ వాపోతున్నారు. మరోవైపు పాతబస్టాండ్ చూట్టూ ప్రహరీ నిర్మించడంతో పండ్ల వ్యాపారులు, చిన్నపాటి హోటల్స్ నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు వ్యాపారం జరుగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత బస్టాండ్‌ను నమ్ముకొని 20 షికారీ కుటుంబాలు, 170 మంది చిరు వ్యాపారులు జీవనం సాగించేవారు. అభివృద్ధి పేరుతో ప్రభుత్వం తమ జీవితాలను చిద్రం చేసిందంటున్నారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ పాత బస్టాండ్ మూసివేసి ఇక్కడి చిరు వ్యాపారులను ఇబ్బందులు పెడుతున్నారని గతంలో కూడా తెలుగుదేశం అధికారంలో ఉన్న కాలంలో రెండు పర్యాయాలు కాసు బ్రహ్మానందరెడ్డి పాతబస్టాండ్ మూసివేశారని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదే పని చేసిందంటున్నారు. అభివృద్ధికి తాము ఆటకం కాదని చిరువ్యాపారులు అవస్థలను కూడా దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నారు. డబ్బుల్చి కొనుగోలు చేసిన భూములను కూడా అభివృద్ధి పేరుతో ఎలాంటి నష్టపరిహారం ఇవ్వకుండా గుజ్జుకోవాలని చూస్తే న్యాయపరంగా పోరాటాడుతామంటున్నారు.

అభివృద్ధి పనులపై సమీక్షించిన ఎమ్మెల్యే

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి

ప్రజాశక్తి- పలమనేరు: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మున్సిపల్, అటవీ, రెవెన్యూ అధికారులతో విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు తీసుకున్న చర్యలు, మున్సిపల్ పరిధిలోని తాగునీటి బోర్ల పరిస్థితి, అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, వీధి వ్యాపారులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలు, పెండింగ్‌లో మున్సిపల్ షాపింగ్ కంప్లెక్స్ పనులపై చర్చించారు. అదేవిధంగా గంటావూరు కాలనీలో ఇంటిపట్టాల విచారణపై రెవెన్యూ అధికారులతో ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక పలమనేరు మండలంలోని ముసలిమడుగు వద్ద ఏర్పాటు కానున్న ఎలిఫెంట్ హబ్ పనులపై స్థానిక ఎఫ్ఆర్వో నారాయణతో ఆయన సమీక్షించారు. ఇప్పటిదాకా జరిగిన పనులను త్వరలో వచ్చి పరిశీలిస్తామని ఆ ప్రాజెక్ట్ ఏర్పాటులో ఏదేని ఇబ్బందులుంటే తెలియజేస్తే పరిష్కారానికి చొరవ చూపుతానని పేర్కొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

డిఆర్‌డిఎ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి- యాదమరి: మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డిఆర్‌డిఏ ఇన్‌ఛార్జి పీడీ శ్రీదేవి అన్నారు. బుధవారం సుచి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి చెందడానికి ఉచిత టైలరింగ్ శిక్షణ, కుట్టు మిషన్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మహిళలు అని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుచి సంస్థ డైరెక్టర్లు గ్లోరీ పాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సుచి సంస్థ ఏర్పాటు చేసి 42 సంవత్సరాలు అవుతున్నదని అప్పటినుంచి ఇప్పటివరకు మహిళలు ఆర్థిక అభివృద్ధి చెందేందుకు శిక్షణ ఇస్తూ వారికి సాంఘిక ఆరోగ్య, అభివృద్ధి విద్యాభివృద్ధి, అన్ని రంగాల్లో వారికి తోడుగా సంస్థ పనిచేస్తుందని తెలిపారు. యాదమరి ప్రభుత్వ వైద్యాధికారిణి సురేఖ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంగా జీవించాలని, ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన పద్ధతులు పాటించాలని తెలిపారు. మహిళలకు సంస్థ ద్వారా వారికి సన్మానం చేయడం జరిగింది. మండలంలోని సుమారు 120 మంది మహిళలు, సుచి స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బంది సాంసన్, ధనలక్ష్మి, జాన్సన్, వరదరాజులు, జాకబ్, డి.చిన్నయ్య, ఎంఎస్ మనీ, శశి కుమార్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

నియోజకవర్గం పరిధిలో పలువురు లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పంపిణీ చేశారు. బుధవారం ఆరుగురు లబ్దిదారులకు రూ.5.34 లక్షలు విలువైన చెక్కులను పంపిణీ చేశారు. చిత్తూరు రూరల్ మండలం జంగాలపల్లికి చెందిన ఎస్.రమేష్‌కు రూ.2.33లక్షలు, వెంకటాపురం చెందిన కేశవులు నాయుడుకు రూ.75వేలు, గుడిపాల మండలం పల్లూరు చెందిన సాయి అఖిల్ రూ.లక్ష, శ్రీరంగంపల్లికి చెందిన జయచంద్ర నాయుడు రూ.53,734లు, చిత్తూరు అర్బన్‌కు చెందిన వి.నవీన్ కుమార్‌కు రూ.52,656, డి.రాజుకు రూ.19,883 చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం : ఫ్యాప్టో

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జీవీ.రమణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం, రాజీలేని ఉద్యమాలను కొనసాగిస్తామని, ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) చిత్తూరు జిల్లా శాఖ స్పష్టం చేసింది. బుధవారం చిత్తూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో ఫ్యాప్టో జిల్లా కార్యవర్గ సమావేశం మునాఫ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన హామీలకు అనుగుణంగా, ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. పెరిగిన ధరలు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా వేతన సవరణను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎస్ ఉద్యోగులకు న్యాయం చేసే విధంగా హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా ఫ్యాప్టో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.నరోత్తమరెడ్డి, ఎన్నికల పరిశీలకులుగా గంటా మోహన్, జివి రమణ, చంగ్రాయ మందడి వ్యవహరించారు. ఫ్యాప్టో చిత్తూరు జిల్లా నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఫ్యాప్టో ఛైర్మన్‌గా ఎన్.మణిగండన్ (యుటిఎఫ్), సెక్రటరీ జనరల్ జి.మునీర్ అహ్మద్ (రూటా), కోఛైర్మన్లు బి.రామమూర్తి (బిటిఏ), బి.అరుణ్ కుమార్ (హెచ్ఎంఏ), పి.రహమత్ బాషా (ఎస్ఏఏ), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్ ఎన్ఆర్.మదన్మోహన్ రెడ్డి (ఎస్‌టియు), కె.చిట్టిబాబు (ఏపీటీఎఫ్ 1938), జి.ముక్తార్ అహ్మద్ (ఏపీటీఎఫ్ 257), ఏ.మునాఫ్ (అప్తా), జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎం.సోమశేఖర్ నాయుడు (యుటిఎఫ్), బి.మోహన్ యాదవ్ (ఎస్‌టియు), కె.కిరణ్ కుమార్ (ఎపిటిఎఫ్ 1938), కె.గోపీనాథ్ (ఏపిటిఎఫ్ 257), లక్ష్మీపతి రెడ్డి (అప్తా), రవీంద్రనాథ్ రెడ్డి (హెచ్ఎంఏ), మహమ్మదుల్లా (రూటా)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎస్పీ బాషా, పార్థసారథి, సురేష్ బాబు, జగదీష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో ఛైర్మన్‌గా ఎన్.మణిగండన్

విద్యుత్తు భారాలపై బుక్‌లెట్ విడుదల



బుక్‌లెట్ విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలు వేయడం దారుణమని వెంటనే భారాలు తగ్గించాలని 'విద్యుత్తు సాకులు' బుక్లెట్‌ను బుధవారం పలమనేరు సిపిఎం కార్యాలయం వద్ద సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి, మంత్రులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గత ప్రభుత్వం ప్రజలపై భారీగా వేసిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారన్నారు. గతంలో సీపీఎం పోరాటం చేసిన సందర్భంగా ప్రతిపక్ష పార్టీ బాదుడే–బాదుడే అనే పేరుతో విద్యుత్ ఛార్జీలపై నిరసన కార్యక్రమాలు చేశారని, గతంలో ఆదానీతో సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారని గుర్తుచేశారు. మరి అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నప్పటికీ గత ప్రభుత్వం అవలంభించిన విధానాలనే కొనసాగిస్తూ ప్రజలపై భారీస్థాయిలో విద్యుత్ భారాలు మోపడం దుర్మార్గమన్నారు. విద్యుత్తు స్మార్ట్ మీటర్లు పెడుతూ ప్రజలపై భారాల మోపడం ఏమిటి అని ప్రశ్నించారు. సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదానికి లాభాలు చేకూర్చే విధానాన్ని పక్కనపెట్టి ప్రజలపై భారం మోపకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గతంలో విద్యుత్తు పోరాటం జరిగిన విధంగా ప్రజలను చైతన్య వంతులను చేసి పోరాటన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పట్టణ కార్యదర్శి గిరిధర్ గుప్తా, నాయకులు ఈశ్వరయ్య, రాజా, జయంతి, లక్ష్మయ్య పాల్గొన్నారు

ప్రజాసమస్యలను వేగంగా పరిష్కరించాలి

వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్ఏ గురజాల

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రజాసమస్యలను సంబంధిత అధికారులు వేగంగా పరిష్కరించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆదేశించారు. బుధవారం చిత్తూరు లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను సానుకూలంగా విన్నారు. పలు సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య తీవ్రతను బట్టి అధికారులు వేగంగా స్పందించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నీటి సరఫరా, వీధిలైట్లు, పారిశుధ్యం, భూ సమస్యలు, పింఛన్లు వంటి సమస్యలను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరించాలన్నారు. ఆర్థికపరమైన రోడ్లు, కాలువల నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదిక సమర్పించాలన్నారు. నగరపాలక అధికారులు సమస్యలను వేగంగా పరిష్కరిస్తున్నారని.. ఇదే స్థాయిలో ప్రజాసమస్యల పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో 164 వినతులు అందాయని వీటిని ఆన్‌లైన్ ద్వారా సంబంధిత శాఖలకు పంపించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్‌రెడ్డి, తహశీల్దార్లు జయంతి, లోకేశ్వరీ, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకటరామి రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు 353 వినతులు ఎమ్మెల్యే థామస్

ఎస్ఆర్ పురం: బుధవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి మండల ప్రజల నుంచి 353 వినతులు అందాయని సంబంధిత శాఖల అధికారులు సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం.థామస్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై వినతులు వచ్చాయని, రెవెన్యూ అధికారులు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు.

కుప్పం రుణం తీర్చుకోలేం..

గుడిచెంబగిరి రచ్చబండలో నారా భువనేశ్వరి

మహిళలతో ముఖాముఖిలో పాల్గొన్న నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సతీమణి నారా భువనేశ్వరి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం గుడిపల్లి మండలం గుడి చెంబగిరి గ్రామంలో మహిళలతో రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ముచ్చటించారు. ఆమె మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలోని ప్రజలు, మహిళల రుణం తీర్చుకోలేమని అన్నారు. అందుకే రాష్ట్రంలో ఏ కార్యక్రమం నిర్వహించినా రాష్ట్ర ముఖ్యమంత్రి మొదటగా కుప్పం నియోజకవర్గంలో ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు టిడిపికి అండగా ఉంటూ ప్రతిఏటా టిడిపికి అత్యధిక మెజార్టీ తీసుకుని వస్తున్నారని అన్నారు. మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చేయడం జరిగిందని తెలిపారు. మహిళలు అన్నిరంగాల్లో ముందుకు వెళ్లాలని దానికి అవసరమైన అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా మహిళలకు జీవనోపాధి ఏ విధంగా చేసుకోవాలన్న ఆలోచనపై కసరత్తు చేస్తున్నామని త్వరలోనే ఆ ప్రణాళికలను కూడా సిద్ధం చేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు బాబు నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ హేమాంబర్ గౌడు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి 50 రాయితీ పొందండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆస్తి పన్ను చెల్లింపుదారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించిందని, నగరపాలక సంస్థ పరిధిలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన పన్నులను గడువులోగా చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరపాలక పరిధిలో భవనాలు, వ్యాపార సముదాయాలు, ఖాళీ స్థలాల యజమానులు 2024–25కు సంబంధించి ఆస్తి పన్నులను 2025, మార్చి 31వ తేదీలోగా చెల్లించి నగరాభివృద్ధికి తమవంతు తోడ్పాటు అందించాలన్నారు. 2024 – 25కు సంబంధించి ఇదివరకే 2024 ఏప్రిల్ 1వ తేదీ తర్వాత పన్ను చెల్లించిన వారికి ఈ 50శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. రాయితీ సొమ్ములను రాబోయే ఏడాదికి జమ చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఇలాంటి అవకాశాన్ని ఇవ్వలేదని.. పన్ను చెల్లింపుదారుల సౌలభ్యం కోసం రాష్ట్రంలోని కూటమి మంచి నిర్ణయం తీసుకుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా చిత్తూరు నగరపాలక పరిధిలో సుమారు రూ.11కోట్ల మేర పన్నుదారుకు లబ్ధి చేకూరుతుందన్నారు. మేయర్ ఎస్.అముద, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళా నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. "కార్యకర్తే అధినేత" కార్యక్రమంలో భాగంగా బుధవారం తెలుగుదేశం పార్టీ మహిళ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో పార్టీ కార్యక్రమాలు జరుగుతున్న తీరు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు.

ముందుగా జీతాలు చెల్లించండి: వైఎస్ఆర్‌టీఏ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మార్చి నెలాఖరున హిందూ, ముస్లిముల ముఖ్యమైన పండుగలు ఉన్నందున ఉద్యోగ, ఉపాధ్యాయులకు శనివారం 29 తేదీన ముందస్తుగా వేతనాలు చెల్లించాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ వి.రెడ్డి శేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ నెల అఖరులో 30న ఉగాది, 31రంజాన్‌లు వచ్చాయని, నూతన వస్త్రాలు కొనుగోలు, ఇతర ఖర్చుల కొరకు ఆర్థికంగా ఇబ్బందులు ఉంటాయి కనుక ప్రభుత్వం వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఎస్ఐ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ ప్రసాద్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బంగారుపాళ్యం మండల ఎస్ఐ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు సంవత్సరాలుగా బంగారుపాళ్యం ఎస్ఐ పోస్టింగ్ ఖాళీగా ఉండడంతో చిత్తూరు రెండవ పట్టణం నుండి బంగారుపాళెం ఎస్ఐగా ప్రసాద్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నవోదయకు బైరెడ్డిపల్లి విద్యార్థులు

భాను ప్రకాష్‌రెడ్డి, కె తులసి ప్రసాద్

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : నవోదయలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశపరీక్షలో మండలంలోని ఎంపీపీ స్కూలుకు చెందిన ఆలపల్లి విద్యార్థి భాను ప్రకాష్‌రెడ్డి, మూగనపల్లి ఎంపీపీ పాఠశాలకు చెందిన కె తులసి ప్రసాద్, విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి ఎంపికయ్యారని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందిన కార్యదర్శి రమేష్‌ను సన్మానిస్తున్న సచివాలయ ఉద్యోగులు

కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: మండలంలోని మొండి వెంగనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఏ రమేష్ గ్రేడ్ 4 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి పొందారు. బుధవారం బ్రాహ్మణపల్లి సచివాలయంలో బట్టే చాణిక్య ప్రతాప్ ఆధ్వర్యంలో రమేష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సచివాలయ కార్యదర్శి ప్రకాష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వేలం పాట నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ

వేలం పాటలో రూ.22.49 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు పంచాయతీకి సంబంధించి నిర్వహించిన వారపు సంత, 11 పంచాయతీ దుకాణాలకు సంబంధించి బుధవారం సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం 22.49 లక్షల ఆదాయం వచ్చింది. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో వారపు సంతకు రూ.14.51 లక్షలు, రూములకు సంబంధించి రూ.7.98 లక్షల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో సర్పంచి మాసిలమని, ఉప సర్పంచి బాబు, నాయకులు మురళి నాయుడు, చంద్రమౌళి, చిరంజీవి పాల్గొన్నారు.

నేడు ఎంపీపీ ఎన్నిక

ప్రజాశక్తి-తవణంపల్లి: తవణంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో 26వ తేదీ బుధవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో మండలంలో ఎంపికైన ఎంపీటీసీలు చేతులెత్తే పద్ధతులలో మండల పరిషత్ అధ్యక్షుడిని ఎన్నుకుంటారని వెల్లడించారు. ఎన్నికను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు .

ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి-పలమనేరు: క్రైస్తవ మత ప్రచారకులు ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నూరు ఈశ్వర్ డిమాండు చేశారు. సోమవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల తూర్పుగోదావరి జిల్లాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని దీనిపై సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ నాయకులు కోరారు. ఈ ఘటనపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, ముఖ్యంగా ప్రవీణ్ పగడాల ప్రముఖ క్రైస్తవ మత బోధకులుగా వున్నారని కొంతమంది మతోన్మాదులు తనపై పగతో ఉన్నారని, ప్రాణహాని ఉందని గతంలో ఆయన అనుమానం వ్యక్తం చేశారని , దీనిపై బలమైన ఆధారాలు ఉన్నందువల్ల ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈశ్వర్ డిమాండ్ చేశారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి -విజయపురం: సీఎం సహాయనిధి చెక్కులను నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ టీడీపీ కార్యాలయంలో బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని మహారాజపురానికి చెందిన పురుషోత్తంరాజుకు రూ. 2,17,200లు, కేవీపురానికి చెందిన నాగస్వామినాయుడుకు రూ.95,537 లు, గంగమాంబాపురానికి చెందిన మునిరత్నంనాయుడుకు రూ. 37,483లు చెక్కును పంపిణీ చేశారు. వైద్య చికిత్స నిమిత్తం చేసిన ఖర్చును తమవంతు సాయం చేశామన్నారు. సాయం పొందిన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, చిత్తూరు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్ రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్ పాల్గొన్నారు.

నారపరాజుకు పరామర్శ

ప్రజాశక్తి -విజయపురం: మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు, వైసీపీ నాయకులు నారపరాజును పాత ఆర్కాడులో ముద్దుకృష్ణమ నాయుడు తనయుడు గాలి జగదీష్ బుధవారం పరా మర్శించారు. ఆయన కంటి శస్త్ర చికిత్స చేసుకొని విశ్రాంతి తీసుకుంటుండంతో పరామర్శించారని తెలిపారు.

సామాజిక తనిఖీలో రూ.32,664 రికవరీ

ప్రజాశక్తి- విజయపురం: విజయపురంలో బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.32,664లు రికవరీకి ఆదేశించినట్లు ఎన్ఆర్జీఎస్పీడీ రవికుమార్ తెలిపారు. మండలంలో 2023 సంవత్సరం ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు మొత్తం ఉపాధిలో రూ.7,11,30,551లకు వివిధ పనులు నిర్వహించారు. ఉపాధి పనులపై ఫిబ్రవరి 10 నుండి ఫిబ్రవరి 24 వరకు గ్రామాల్లో విచారణ నిర్వహించి పరిశీలించారు. పండ్ల మొక్కల పెంపకాలలో రికవరీ వచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, ఏపీడీ సునీల్ కుమార్, ఏపీవో బబిత, జేఈ మధుబాబు, సాకేంతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ప్రయాణం అత్యంత కష్టం!

- అధ్వాన స్థితిలో రహదారులు
- రోడ్డు దిగాలంటే భయం..
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు..
- అభివృద్ధి చేయాలంటున్న నేతలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రాలు, దేశం అభివృద్ధి చెందుతుందని మహాత్మా గాంధీ ఎప్పుడో చెప్పారు.. దేశానికి గ్రామీణ ప్రాంతాలే పట్టుకొమ్మలు.. ఈ గ్రామ ప్రాంతాలను కలుపుతూ పట్టణాలకు రోడ్లు బాగా విస్తరించాయి. ఇప్పుడు అవి అధ్వాన స్థితిలో ఉన్నాయి. వీటి అభివృద్ధి కొన్ని సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రభుత్వాలు మారినా ఈ రోడ్ల దుస్థితి మారక ఇలాగే ఉంటూ ప్రయాణం కత్తి మీద సాములా ప్రమాదకరంగా మారింది. దీంతో ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహన చోదకులు, పాదచారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది..

అధ్వాన స్థితిలో రహదారులు

వెదురుకుప్పం మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలను కలుపుతూ రోడ్లు ఇటు తిరుపతికి, అటు చిత్తూరుకి పక్క రాష్ట్రమైన పళ్లిపట్టుకు వెళ్లే ప్రధాన మార్గాలు ఉన్నాయి. తిరుపతి నుంచి పచ్చికాపల్లం మీదుగా, వెదురుకుప్పం మండలాన్ని కలుపుతూ కొత్తపల్లి మిట్ట వరకు రోడ్డు వుంది. అక్కడి నుంచి చిత్తూరు, పుత్తూరు జాతీయ రహదారిలో కలుస్తోంది. ఈ మధ్యలో ఉన్న రోడ్డు మొత్తం సింగిల్ రోడ్డు. ఎదురుగా ఏదైనా వాహనం వస్తే దిగాలంటే భయాందోళనకు గురవుతోంది. అడుగడుగునా అధికంగా మలుపులు ఉన్నాయి. తారు రోడ్డుకి ఆనుకుని రోడ్డు కోతలకు గురవడంతో ప్రమాదకర స్థితిలో అధ్వానంగా దర్శనమిస్తోంది. వచ్చికావల్లం నుంచి కార్వేటి నగరం వరకు వున్న సింగల్ రోడ్డు వుంది. ఈ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం కార్వేటినగరం మండలానికి చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా పోట్టు చేను సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాను ఢీకొని మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటూనే వున్నాయి. రోడ్డు దిగాలంటే కంకర తేలిన గుంతలు, ఎదురుగా వస్తున్న వాహనాలు.. ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితిలో వాహన చోదకులు అయోమయంలో పడుతున్నారు. ఇటు గ్రామ ప్రాంత ప్రజలు నడిచి వెళ్లాలన్నా ప్రమాదాలతో భయాందోళనకు గురవుతున్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరు..

రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందడంతో మృతుని బంధువులు 'ప్రాణాలు పోతున్నా రోడ్డును బాగు చేయరా?' అని ఆర్తనాదాలు పెడుతూ ఆవేదన వ్యక్తం చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ఈ రోడ్డును విస్తరించి బాగు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు బాగుంటేనే..గ్రామాలు అభివృద్ధి



గ్రామీణ ప్రాంతాల రోడ్లు బాగుంటేనే అభివృద్ధి బాగుంటుంది.. మలుపులు ఉన్నాయి.. మండలంలో ప్రధాన రహదారులు సింగిల్ రోడ్లుగా ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేస్తేనే ప్రభుత్వాలకు గుర్తింపు వస్తుంది. రోడ్లు బాగుంటే రైతులు పండించిన పంటలను పట్టణాలకు తీసుకెళ్లి అమ్ముకుంటారు. ప్రయాణం సులభతరం అవుతుం ది.. ప్రభుత్వం వెంటనే స్పందించాలి..

- పోటుగారి భాస్కర్, చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు.

29న మండల సమావేశం

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అనిత అధ్యక్షతన ఈనెల 29వ తేది శనివారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, వైస్ ఎంపీపీలు, జెడ్పిటిసి, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని సూచించారు. అధికారులు ఆయా శాఖలకు చెందిన నివేదిక వివరాలతో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

ఎంపీపీ నిధులతో తాగునీటి బోరు

తాగునీటి బోరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఎంపిపి నిధులతో మండలం లోని పాలమడుగు ఇండ్ల వద్ద బుధవారం తాగునీటి బోరు ఏర్పాటు చేశారు. పెరుమాళ్ల పల్లి ఎంపీటీసీ తోకల మురళి రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ నిధులతో వెదురుకుప్పం మండలం గొడుగు చింత పంచాయతీ తార్లబైలు లోని పాల మడుగు ఇండ్ల వద్ద తాగు నీటి బోరు ఏర్పాటు చేశారు. పుష్కలంగా నీళ్ల వచ్చాయని ఆ గ్రామ ప్రజలు స్థానిక ఎంపీటీసీని అభినందించారు.

రేపు వారపు సంత వేలం

ప్రజాశక్తి -కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో నిర్వహించే వారపు సంతకు ఈ నెల 28వ తేదీ శుక్రవారం వేలం పాట నిర్వహిస్తామని ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ నాగ రత్నమ్మ తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈవోపీఆర్డీ మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారపు సంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు, జంతువధ శాలలకు సంబంధించిన వాటికి శుక్రవారం ఉదయం 11 గంటలకు పంచాయతీ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ముందస్తు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెచ్చు పాట దారునికి అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

ఇతరులకు ప్రవేశం నిషేధం: డిఎస్‌పి

మాట్లాడుతున్న కుప్పం డిఎస్‌పి పార్థసారధి

ప్రజాశక్తి-కుప్పం రూరల్ : రామకుప్పం గ్రామ పరిధిలో ఇతరుల ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్లు కుప్పం డిఎస్‌పి పార్థసారథి తెలిపారు. మార్చి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు పోలీసు యాక్ట్ 30 అమలులో ఉందని, రామకుప్పం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో 27వ తేదీ ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఎన్నికలలో ఓటు వేసే ఎంపీటీసీలకు, గ్రామ ప్రజలకు మాత్రమే రామకుప్పం గ్రామంలో ప్రవేశం ఉంటుందన్నారు. బయటి వారు గ్రామంలో ప్రవేశిస్తే గ్రామంలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉందన్నారు. బయట వ్యక్తులకు గ్రామంలో ప్రవేశాన్ని నిషేధిస్తున్నామని తెలిపారు. పోలీసు ఉత్తర్వులను కాదని ఎవరైనా గ్రామంలో ప్రవేశించి, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయితీ గడ్డి విత్తనాలు అందిస్తున్న వ్యవసాయాధికారిణి చందనప్రియ

గడ్డి విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

పశువైద్యాధికారిణి చందన ప్రియ

ప్రజాశక్తి - సోమల: రాయితీ గడ్డి విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారిణి చందనప్రియ పేర్కొన్నారు. బుధవారం పెద్ద ఉప్పరపల్లి పశువైద్య కేంద్రం వద్ద పెద్ద ఉప్పరపల్లి, అన్నెమ్మ గారి పల్లి, ఆవులపల్లి పంచాయతీ పరిధిలోని రైతులకు రాయితీపై మొక్కజొన్న జొన్న విత్తనాలను ఆమె పంపిణీ చేశారు. మొక్కజొన్న విత్తనాలు 68 రూపాయలు కిలో కాగా రాయితీపై 17 రూపాయలకే అందజేస్తున్నామని, జొన్న విత్తనాలు 92 రూపాయలు ధర ఉండగా రాయితీపై 23 రూపాయలకే అందజేస్తున్నామని , అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల వద్ద సిబ్బందిని సంప్రదించి రాయితీ విత్తనాలు పొందవచ్చునని తెలిపారు. వేసవికాలంలో పశువులకు గడ్డి కొరత లేకుండా రాయితీపై మండలంలోని రైతులకు మొక్కజొన్నలు 4500, జొన్న విత్తనాలు 3000 కిలోలు అందుబాటులో ఉన్నాయని వీటిని 75శాతం రాయితీపై రైతులకు అందిస్తున్నామని రైతులు కొనుగోలు చేసి వాటిని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారిణి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, గుత్తా చంద్రశేఖర్ నాయుడు రైతులు పాల్గొన్నారు.

6న జిల్లా మహాసభలకు రండి..

ఎమ్మెల్యేకు ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఎస్ఆర్‌పురం : ఏప్రిల్ 6వ తేదీ చిత్తూరులో నిర్వహించనున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా 4వ మహా సభలకు ముఖ్య అతిథిగా రావాలని జిడి నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వియం థామస్‌ను ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ, ఏపీడబ్ల్యూజేఎఫ్ గంగాధరనెల్లూరు నియోజకవర్గ కమిటీ ప్రతినిధులు బుధవారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీని ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు కరకుంట్ల జయరాజ్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు బి ప్రకాష్, ఉపాధ్యక్షులు ఎట్టేరి దేవరాజులు, జిల్లా కోశాధికారి పి కృపానందరెడ్డి, యాదవేంద్రరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సంయుక్త కార్యదర్శి కుభేంద్రన్, ఆంధ్రప్రదేశ్ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్ (ఏపీబిజెఏ) జిల్లా ప్రధాన కార్యదర్శి నీరజాక్షులు అలియాస్ చిన్న, ఉపాధ్యక్షులు విజయ్, జయప్రకాష్ జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు మోహన్ దాస్, ప్రధాన కార్యదర్శి దేవరాజులు, సంయుక్త కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే థామస్

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి -వెదురుకుప్పం: డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెదురుకుప్పం అంతర్గత నాణ్యతా హామీ విభాగం(ఐక్యూఏసి), ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెదురుకుప్పం పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం నాయుడు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఎదురయ్యే చట్టపరమైన సమస్యలు, శిక్షల గురించి ఆయన వివరంగా తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి అన్నపూర్ణ శారద మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి వివరించారు. విద్యార్థులు ఈ వ్యసనాలకు బానిసలు కాకుండా, ఆరోగ్యకరమైన జీవనం గడపాలని సూచించారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు, సమాజంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై స్పష్టమైన అవగాహన కలిగిం దని, భవిష్యత్తులో వారు ఈ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారని అందరూ ఆశాభావం వ్యక్తం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం నాయుడు హెడ్ కానిస్టేబుల్ వేలుకి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి వెంకటేష్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ సి మంగళ గౌరీ, డాక్టర్ వి ప్రభాకర్ రావు, డాక్టర్ ఏసీ భరణినాథ్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ

కందూరుకు రూ.9.52 వేల ఆదాయం

ప్రజాశక్తి -సోమల: బహిరంగ వేలం పాటల్లో సోమల మండల మేజర్ పంచాయతీ కందూరుకు భారీగా రూ.9లక్షల 52 వేలు ఆదాయం వచ్చింది. సోమల మండలం మేజర్ పంచాయతీ కందూరులో ప్రతి ఆదివారం నిర్వహించే వారపు సంత, ప్రతిరోజూ నిర్వహించే బస్టాండ్ గేటు, రెండు చేపల చెరువుల నిర్వహణకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల్లో భారీ ఆదాయం లభించింది. సర్పంచి బాషా మసూద్, టిడిపి మండల అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు పంచాయతీ కార్యదర్శి జయశంకర్ ఆధ్వర్యంలో సచివాలయంలో నిర్వహించిన వేలం పాటల్లో వారపు సంత నిర్వహణను 8 లక్షల 20వేల రూపాయలకు హెచ్చు పాటదారుడు ద్వారక నాథరెడ్డి కైవసం చేసుకున్నారు. ప్రైవేటు బస్టాండు రూ.ఒక లక్ష 32 వేలకు అల్తాఫ్ కైవసం చేసుకున్నారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. రెండు వేలంపాటలకు రూ.9,52,000 ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోలిస్తే మూడులక్షల అరవై ఐదు వేల రూపాయలు అధికంగా లభించిందని తెలిపారు. బసినాయుని చెరువు 25,100, తిప్పాని చెరువు 12,100, రెండు చేపల చెరువుల వేలం పాటల్లో 37వేల రూపాయల ఆదాయం రాగా, మిగిలిన రెండు చేపల చెరువులకు వేలంపాట నిర్వహించలేదని కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కందూరు పంచాయతీలో వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి- విజయపురం: విజయపురంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రంగాను బుధవారం వైసీపీ నాయకులు శాలువాతో సత్కరించారు. మండలంలో శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, వైస్ఎంపీపీ మంజు బాలాజీ, నాయకులు కుమార్, సతీష్యాదవ్, జిల్లుదాసు పాల్గొన్నారు.

ఎస్ఐని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

అంగన్‌వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : కుప్పం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ చంద్రకళ ఆధ్వర్యంలో పోషణ్ భీ, పడాయి భీపై బుధవారం అవగాహన నిర్వహించారు. మూడు రోజుల కార్యక్ర మంలో భాగంగా బరువు తక్కువగా ఉన్న పిల్లల ఆహార విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, వారికి పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. పిల్లలకు ఆటలు, పాటలు, కథలు ద్వారా వారి నైపుణ్యం పెంపునకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. విద్యాబోధనపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కుప్పం, గుడుపల్లి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుప్పంలో


చిత్తూరులో

చిత్తూరు అర్బన్: పోషన్ బి; పడాయి బిపై యాదమరి మండలం కాశిరాల కే గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో బంగారుపాలెం ప్రాజెక్టు పరిధిలోని యాదమరి మండలం కాశిరాల మాదిరెడ్డిపల్లి సెక్టార్లకు అంగన్వాడీ కార్యకర్తలకు అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఐసిడిఎస్ సూపరువైజర్ లలిత, కవిత, సరళ కుమారి మాట్లాడుతూ నాణ్యమైన విద్యను పెంపునకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల్లోని సృజనాత్మక శక్తి వెలికి తీతకు ఇది ఉపయోగపడు తుందన్నారు. ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ తరగతుల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: పోషన్ బి, పడాయి బి శిక్షణతో అంగన్వాడీ కేంద్రాలు పటిష్టం అవుతాయని జిల్లా మహిళ శిశు సంక్షేమ పీడీ వెంకటేశ్వరి అన్నారు. గంగాధర నెల్లూరులో అంగన్వాడీ టీచర్లు రెండో బ్యాచ్ కు రెండో రోజు నిర్వహించిన శిక్షణా తరగతులను పీడీ వెంకటేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ శీలా అనే కొత్త కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీల నైపుణ్యం పెంపునకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ వినత శ్రీ, సూపర్వైజర్లు భాగ్యలక్ష్మి, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

పూతలపట్టులో

పూతలపట్టు: నవచేతన్ ఆధార్ షీలా కార్యక్రమం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాన్ని అధిగమించడానికి అంగన్‌వాడీ కార్యకర్తలు చర్యలు చేపట్టాలని సిడిపిఓ సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల పిల్లలకు ఆధార్ షీలా ద్వారా 25 రోజులు పోషకాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విటమిన్ ఏ, ఐరన్ విటమిన్ డి, అయోడిన్ లోపం తగ్గించడానికి ఆకుకూరలో వాడడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన అంగన్‌వాడీ వర్కర్లకి ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజర్లు భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

దొంగతనం కేసులో నిందితుడికి మూడు నెలల జైలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: 2023లో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సికెబాబు నివాసంలో జరిగిన దొంగతనం కేసుకు సంబంధించి నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ 5వ అదనపు సివిల్ జడ్జి, స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి పి వెన్నెల బుధవారం తీర్పు ఇచ్చారు. నిందితుడు జి మహేష్ మాజీ ఎమ్మెల్యే సికెబాబు ఇంట్లో పనిమనిషిగా వున్న సమయంలో ఓ రాత్రి ఎగ్జాస్ట్ సందు ద్వారా ఇంట్లోకి ప్రవేశించి రూ. లక్ష దొంగతనం చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే సతీమణి ఫిర్యాదు మేరకు అప్పటి క్రైమ్ స్టేషన్ ఎస్.ఐ ఉమామహేశ్వర రావు కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి క్రైమ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టి సాంకేతిక ఆధారాలను ఉపయోగించి నిందితుడు మహేష్‌ను గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టు విచారణలో నిందితుడిపై ఆరోపణలు రుజువుకావడంతో బుధవారం 5వ అదనపు సివిల్ జడ్జి , స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి పి వెన్నెల నిందితుడికి మూడు నెలల సాధారణ జైలు శిక్ష విధించారు.

మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

విద్యతోనే భవిత మార్పు: జడ్జి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పాఠశాలలో విద్యతోనే భవిత మారుతుందని 9వ అడిషనల్ జిల్లా జడ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సంక్రాంతి పల్లి మండల కేంద్రంలోని బాలికల వసతి గృహంలో పోక్సో చట్టంపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదవ అడిషనల్ జిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలకు పాఠశాలలోనే భవిష్యత్తు మారుతుందని తమతో విద్య నేర్చుకున్న వారు పలు శాఖల్లో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నత ఆశయాలతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఈ క్రమంలో బాలికలు, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై తోటి వారితో చర్చించి తగిన సలహాలు, సూచనలు తీసుకుని వాటిని నిర్మూలించేందుకు ముందుకు రావాలని అప్పుడే సార్థకతకు నిదర్శనమన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అనంతరం 'పాఠశాలలోనే భవిత మార్చుకుందాం' పాటను విద్యార్థులకు వినిపించి సారాంశం వివరించారు. ఈ కార్యక్రమంలో ఐదవ అడిషనల్ జిల్లా జడ్జి బాబు నాయక్ , సివిల్ జడ్జి పద్మజ , సోషల్ వెల్ఫేర్ డిడి చెన్నయ్య, తహశీల్దారు బాబు రాజేంద్రప్రసాద్, ఎస్ఐ ప్రసాద్, వార్డెన్ గీత పాల్గొన్నారు

రైతుల సంక్షేమానికి పెద్దపీట: టిడిపి

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - రామకుప్పం: రాష్ట్రంలో రైతుల సంక్షేమా నికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి అన్నారు. రామకుప్పం లోని పశువైద్యశాలలో రైతులకు రాయితీపశుగ్రాస విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. రామకుప్పం మండలానికి 8 టన్నుల మొక్క జొన్న విత్తనాలు, 3 టన్నుల జొన్న విత్తనాలు వచ్చాయి. 75 శాతం రాయితీతో మొక్క జొన్న విత్తనాలు 5 కేజీల సంచి 85 రూపాయలు, తెల్ల జొన్నలు సంచి 115 రూపాయలు, రైతు చెల్లించాల్సి వుంటుందన్నారు. అవసరమైన వారు ఆధార్, పట్టదారు పాసుపుస్తకం జెరాక్స్ కాపీ తీసుకొని సంబంధిత రైతు సేవా కేంద్రం వద్ద విత్తనాలు పొందవచ్చునన్నారు. ఒక్క పాసు పుస్తకానికి 20 కేజీలు విత్తనాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో, సీతాపతి, చిన్ని కృష్ణయ్య, పద్మనాభరెడ్డి, రామకృష్ణప్ప, వెంకట రమణ, బాలు, సుబ్రహ్మణ్యం, జయప్ప, పశువైద్యాధికారి డాక్టర్ రవిశంకర్ ,బాబు పాల్గొన్నారు.

కార్యకర్తల సమస్యల పరిష్కారంపై దృష్టి

పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి

మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-సోమల: పార్టీ కార్యకర్తల సమస్యల పరిష్కారం పై దృష్టి సారిస్తామని పుంగనూరు టిడిపి ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలతో నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ టిడిపి కార్యకర్త రామకృష్ణని కోల్పోవడం బాధాకరమని, టిడిపి అధికారంలోకొచ్చినా కొంతమంది అధికారులు ఇంకా వైసిపి నాయకులకు వంతపాడుతున్నారన్నారు. వారి సంగతిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని, గత 20 సంవత్సరాలుగా పుంగనూరులో భూ కబ్జాలు, అక్రమాలు, దౌర్జన్యాలు చేశారని ఇకపై వారి ఆటలు సాగని సాగనివ్వమని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడి జైలుకు వెళ్లారని అలాంటి వారికి అందరికీ తగిన గుర్తింపు ఇస్తామన్నారు. వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు, బూత్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, పార్టీ అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వైస్ ఎంపీపీ ఎన్నిక

ప్రజాశక్తి -విజయపురం: గురువారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో రెండవ వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహిస్తున్నామని ఎంపీడీవో రాజేంద్ర బుధవారం తెలిపారు. ఎంపీటీసీలు, కోఆప్షైన్ మెంబరు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఈ ఎన్నికకు కోరం అవసరం లేదని, చేతులు ఎత్తి ఎన్నుకుంటామన్నారు.